క్లుప్తంగా

కాజీపేట జీఆర్పీ సీఐకి సన్మానం

కాజీపేట రూరల్ : కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన వడ్డే నరేష్‌కుమార్‌ను మంగళవారం రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు శాలువా, పూలబొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ 24 గంటల పాటు అందరికి విధి నిర్వహణలో అందుబాటులో ఉంటానని తమతో చెప్పారని రైల్వే నాయకులు తెలిపారు. రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఆర్.సమ్మయ్య, రాజేందర్, ముత్యాల విజయ్, ప్రవీణ్, జడల శ్యామ్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన లారీ ఓనర్స్ ప్రతినిధులు



ఖిలా వరంగల్ : మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును మంగళవారం ఇటీవల నూతనంగా ఎన్నికైన ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ.షకీల్ అహ్మద్, కార్యదర్శి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావుకు వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. లారీ ఓనర్లకు ఎదురయ్యే ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని లారీ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కొండాను కలిసిన వారిలో లారీ కార్యవర్గ ప్రతినిధులు ఓనర్లు ఉన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

మడికొండ : కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మడికొండ 1, 2, 3లకు స్థలం కేటాయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు మంగళవారం సుబేదారిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కలిసిన వారిలో ఎన్‌హెచ్‌ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి ఎండీ. రుక్మొద్దీన్, మడికొండ-2 మెడికల్ ఆఫీసర్ ఓంప్రకాశ్, మడికొండ-3 డాక్టర్ ఇర్ఫాన్, మడికొండ-1 డాక్టర్ సంతోష్, వినోద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు ఉన్నారు.

పరామర్శ

నయీంనగర్: అనారోగ్యంతో బాధపడుతున్న పోస్టల్ పెన్షనర్స్ తెలంగాణ ప్రెసిడెంట్ సిరిమల్లె సదానందంను నయీంనగర్‌లోని ఆయన స్వగృహంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య పరామర్శించారు.

సైడ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం


కాజీపేట : మండలంలోని సోమిడి ఎస్సీ కాలనీలో మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. కాలనీవాసులతో గల్లీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాచర్ల జయాకర్, మహిళ అధ్యక్షురాలు కుమ్మరి నీలక్క, సుధాకర్, రవికిరణ్, కుమ్మరి స్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ట్యాబ్ అప్పగింత



వరంగల్ క్రైం : నగరంలోని స్నేహనగర్‌కి చెందిన గుగులోతు రిషిక మంగళవారం హైదరాబాద్‌లో ఐపీ మ్యాట్ పరీక్ష రాసి తిరిగి వస్తున్న క్రమంలో సుబేదారి బస్టాప్ వద్ద బస్సు దిగి ఇంటికి చేరుకొని చూడగా తన వెంట తీసుకొచ్చిన ట్యాబ్ కనిపించలేదు. వెంటనే సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు అందజేయగా ఎస్సై రామారావు, కానిస్టేబుల్ లియాఖత్ అలీలు బాధిత యువతి పోగొట్టుకున్న ట్యాబ్‌ను రికవరీ చేసి అప్పగించినట్లు సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

ఎమ్మెల్సీ ఆర్థికసాయం



కాజీపేట : మండలంలోని సోమిడి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుమ్మరి శరత్‌బాబు కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శరత్ బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, పీఆర్టీయూ సభ్యులు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

కాజీపేట: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో నేడు (బుధవారం) ఉదయం 9 గంటలకు రెండు ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ చంద్ర మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు హాజరై కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు.

ఔరా.. ఓరుగల్లు అనేలా!

- ప్రపంచ సుందరీమణుల కోసం విస్తృత ఏర్పాట్లు
- జిగేల్‌మంటున్న కూడళ్లు, కట్టడాలు



విద్యుత్ వెలుగుల్లో హనుమకొండ కలెక్టరేట్ సముదాయం



హనుమకొండలోని హరిత హోటల్



బల్దియా ప్రధాన కార్యాలయం



నగరంలోని ఓ కూడలి

వరంగల్ అర్బన్ : ట్రైసిటీలో అభివృద్ధి పనులు, సుందరీకరణకు గ్రేటర్ వరంగల్ రూ.కోట్లు వెచ్చిస్తోంది. కొద్ది నెలలకే పనులు, పచ్చదనం, పారిశుద్ధ్య నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. కానీ ప్రముఖులు, సీఎం, విదేశీయుల పర్యటన సమయంలో వాటి తీవ్రతను దాచేందుకు 'మహా' ఇష్టం చూపుతున్నారు. బుధవారం సాయంత్రం వరంగల్ నగరం పర్యటనకు ప్రపంచ సుందరీమణులు విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రైసిటీలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న డబ్బాలు, తోపుడుబండ్లు, చొచ్చుకొచ్చిన కట్టడాలను తొలగించారు. రహదారులను విశాలంగా చేశారు. నల్లగా, దుమ్ము పట్టి ఉన్న డివైడర్లను నిగనిగలాడేలా, డివైడర్లపై పచ్చదనం పరుచుకున్న ఆకు పచ్చ అందాలు, పార్కుల్లో పచ్చచీర కట్టినట్లున్నాయి. ఫుట్‌పాత్‌లు ఇరువైపులా పాదచారులు మహా రాజులనుకునేలా మారాయి. పలుకూడళ్లకు కొత్త సొబగులద్దారు. విద్యుత్ వెలుగులతో జిగేల్‌మంటున్నాయి. ఏళ్లుగా సరిగా నిర్వహణలేని హరిత కాకతీయ హోటల్‌ను ఆధునీకరించారు. రెండు జిల్లాల కలెక్టరేట్లకు సిరీస్ బల్బులు వేశారు. ఆ వెలుగుల్లో భవనాలు మెరిసిపోతున్నాయి. ఆహా వరంగల్ అనే తరహాలో ప్రపంచ సుందరీమణుల కోసం బల్దియాలోని పలు విభాగాల అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు శ్రమించారు.

పూడికతీతలో వేగం పెంచాలి

- మేయర్ గుండు సుధారాణి



12వ డివిజన్‌లో నాలాల పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్ : నాలాల్లో పూడికతీత పనుల్లో వేగం పెంచాలని బల్దియా మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం బల్దియా పరిధిలోని వరంగల్‌లోని 14, 22 డివిజన్‌ల పరిధిలో మేయర్ క్షేత్ర స్థాయిలో పర్యటించి శానిటేషన్ డీసిల్టింగ్ పనుల పురోగతిని పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పోచమ్మమైదాన్ జంక్షన్ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. దేశాయిపేట రోడ్డులో పర్యటించి నీటి లీకేజీలను గుర్తించి ఇంజినీర్లకు మందలించారు. కొబ్బరి బొండాలు విక్రయదారుడితో మాట్లాడే క్రమంలో వినియోగించిన బొండాలను అక్కడే వేస్తున్నారని కోకో పిట్ యూనిట్‌కు తరలించేలా చూడాలని ఏంహెచ్‌ఓ ను ఆదేశించారు. కోట చెరువు యూటీ వద్ద కొనసాగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట కార్పొరేటర్లు కవిత, కుమారస్వామి, ఎం హెచ్‌ఓ డాక్టర్ రాజేష్ , ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ లు రంగారావు, కృష్ణమూర్తి, టీపీఎస్ అనిల్ తదితరులు ఉన్నారు.

వేయిస్తంభాల ఆలయం పరిశీలన

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయాన్ని మిస్‌వరల్డ్ సుందరీమణులు సందర్శించనున్న సందర్భంగా మంగళవారం నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అశ్వినితానాజి వాకడే, కుడా అధికారులు దేవాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. దేవాలయంలో, దేవాలయం ముందు భాగంలోని కుడా గార్డెన్‌లో పచ్చదనం కోసం గార్డెనింగ్‌లో భాగంగా వివిధ రకాల పూలమొక్కలు, క్రోటన్స్ మొక్కలను అమర్చే విధానాన్ని తదితర పనులను పరిశీలించారు. దేవాలయం చుట్టూ, ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మేయర్ అధికారులకు సూచించారు.

కాకతీయుల కళా వైభవం ఓరుగల్లు..

- నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు



కాజీపేట అర్బన్ : చారిత్రాత్మక చరిత్ర గల ఓరుగల్లు నగరానికి మిస్‌వరల్డ్-25కు గాను విచ్చేస్తున్న ప్రపంచ సుందరీమణులకు కాకతీయుల కళా వైభవం, కట్టడాలు స్వాగత తోరణంలా స్వాగతం పలుకుతున్నాయని నిట్ రిటైర్డ్ సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు మంగళవారం సాక్షితో ప్రత్యేక తెలిపారు. 11 నుంచి 14వ దశాబ్ధంలో నాటి కాకతీయులు 3టీ (ట్యాంక్ ,టెంపుల్, టౌన్‌షిప్) కాన్సెప్ట్‌తో పరిపాలన కొనసాగించారని తెలిపారు. ఇందులో భాగంగా వెయ్యిస్తంభాల దేవాలయం, భద్రకాళీ ట్యాంక్, రామప్ప దేవాలయం , ఖిలా వరంగల్ నిర్మాణాలు నాటి అపురూప కట్టడాల పనితీరును నేటి ఇంజనీర్లకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అదే విధంగా వ్యవసాయానికి సాటిగా నిలిచేందుకు లక్నవరం, పాకాల, ధర్మసాగర్, కేసముద్రం రిజర్వాయర్ల నిర్మాణం నిలుస్తుందని అన్నారు. నీటిలో తేలే ఇటుకల తయారీతో ప్రపంచ స్థాయి చరిత్ర సృష్టించారు.

సంక్షిప్త సమాచారం

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్ : కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ని వడ్డెపల్లి చెరువు సమీపంలో రైల్వే పంప్‌హౌజ్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ హెచ్.ఉపేందర్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని సుమారు 45 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5.5 ఎత్తు, ఛామనచాయ రంగు, వంకాయ రంగు టీ షర్టు ధరించి ఉన్నాడు. మృతుని తలభాగం తెగిపోయి రైలు పట్టాల మధ్య పడి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సెల్ నంబర్లు 9247800433, 9948348070 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

హసన్‌పర్తి : కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధి కోమటిపల్లి రైల్వేట్రాక్ సమీపంలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. మృతుడు 25 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని పోలీసులు చెప్పారు. బూడిద రంగు పూలషర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. వివరాలకు 8712685115, 6712685089,8712685004 నంబర్లను సంప్రదించాలని సీఐ రవికుమార్ సూచించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



రామన్నపేట : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎంజీఎం హాస్పిటల్‌లో ఏఐటీయూసీ నాయకులు మంద సంజీవ, గడల రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రమేష్ పాల్గొని సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

20న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ఖిలా వరంగల్: కార్మిక కర్షక శ్రమ జీవుల హక్కుల డిమాండ్ సాధనకై ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సిలువేరు విజయ అధ్యక్షతన జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాలి

కేయూ క్యాంపస్ : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూలోని సాంకేతిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఆయా ఉద్యోగుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యూఈఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి, ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి బి.వెంకట రాజు కోరారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఆ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు.


మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

ఖిలా వరంగల్: పొదుపు పరపతి సంఘం పేరుతో మోసం చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. అంతకు ముందుగా రూ.2 కోట్లతో పరారైన సంఘ అధ్యక్షుడు వెంకటయ్య ఇంటి ఎదుట బాధితులు ఆందోళన చేపట్టారు. అనంతరం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు బాధితులు చేరుకోగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని బాధితుల అండగా నిలిచారు.

ఆవిర్భావ సభకు తరలిరావాలి

హన్మకొండ : బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ నాయకులు జన్ను సాంబయ్య పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన్ రాజ్యాధికారి పార్టీ ఆవిర్భావ సభకు సంబంధించిన కరపత్రాలను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు ప్రకటించాలని పలుపునిచ్చారు.

రేపు తెలంగాణ శివశక్తుల సమావేశం



హన్మకొండ చౌరస్తా : ఓరుగల్లు శివశక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న వరంగల్‌లోని నాని గార్డెన్స్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి శివశక్తుల (చౌదరి బిరుదాంకిత కార్యక్రమం) సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ట్రాన్స్‌జెండర్స్ కమ్యూనిటీ అధ్యక్షురాలు లైలా తెలిపారు. మంగళవారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ కావ్య నివాసంలో ఆమెను కలిసిన లైలా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్స్ కమ్యూనిటీ సమస్యలు, వారి అభ్యున్నతికి అవసరమైన ప్రభుత్వ సహకారం గురించి లైలా కావ్యతో చర్చించారు. కావ్య సానుకూలంగా స్పందిస్తూ సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు అందించడమే అభివృద్ధికి నిదర్శనమన్నారు. ట్రాన్స్‌జెండర్స్ సముదాయం కోసం అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ కావ్య అన్నారు.

81 మందితో మార్కెట్ వర్తక సంఘం ఏర్పాటు



వరంగల్ చౌరస్తా : వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వర్తక సంఘం నూతన కమిటీని 81 మందితో ఏర్పాటు చేసుకున్నట్లు అధ్యక్షుడు జారతి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం వరంగల్ స్టేషన్‌రోడ్డులోని గ్రాండ్ గాయత్రి హోటల్‌లో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్తిస్థాయి కమిటీని ఎంపిక చేసి ప్రకటించారు. సంఘం ప్రధాన కార్యదర్శి గులాం సర్వర్ మున్న, కోశాధికారి మల్లూరి బాబురావు, మార్కెట్ వ్యాపారస్తులు కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, గులాం అఫ్జల్, మజీద్ అహ్మద్ బాబా, కర్ర వెంకన్న, పార్ష గోపి, కర్ర నాగేశ్వర్ రావు, చింతాకుల సునీల్, దేవరపల్లి ఆనంద్, భిక్షపతి, సదానందంతో కలిసి జంబో కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్పొరేటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మార్కెట్ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా ఒక మంచి నిర్ణయంతో అన్ని వర్గాలకు అవకాశం కల్పిస్తూ జంబో కమిటీ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉపాధి

హసన్‌పర్తి : పాలిటెక్నిక్‌తో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్ రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి తిరుమల్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ అధికంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా డీఆర్‌డీఓ, బీహెచ్‌ఈఎల్, రైల్వేల్లో ఉద్యోగాలు కూడా లభిస్తున్నాయన్నారు. పాలిటెక్నిక్ అభ్యసించిన విద్యార్థులు ఈ-సెట్ ద్వారా బీటెక్ సెకండియర్‌లో ప్రవేశం పొందవచ్చన్నారు. పాలిటెక్నిక్‌లో అర్హత సాధించి తమ కళాశాలలో ప్రవేశం పొందే నిరుపేదల విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు.

మెరిసిన ఎస్ఆర్ సీఎస్ సీబీఎస్ఈ స్కూల్



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ రాజిరెడ్డి

ధర్మసాగర్ : మండలంలోని ఉనికిచర్ల శివారులోని ఎస్ఆర్ సీఎస్ సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ముచ్చ రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం సీబీఎస్ఈ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో పాఠశాల విద్యార్థులు శ్రీలక్ష్మీ ప్రియకు 500 మార్కులకు 389 మార్కులు, ఆర్యన్ 380 మార్కులు, బిట్టు నాయక్ 375 మార్కులు, వర్షిణి 369 మార్కులు సాధించి అత్యంత ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా మిగతా విద్యార్థులు 300 పైగా మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. సబ్జెక్టు వైస్‌గా మార్కులు సాధించిన విద్యార్థుల్లో.. తెలుగులో 90, ఇంగ్లిష్‌లో 86, మ్యాథ్స్‌లో 80, సైన్స్‌లో 81, అలాగే సోషల్లో 81 మార్కులు సాధించి రామానుజన్ స్కూల్ టాపర్‌గా నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ రాజిరెడ్డి, కరస్పాండెంట్ ముచ్చ అరుణ, ఏపీసీసీ సభ్యులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభినందించారు.

సీబీఎస్ఈలో స్కిల్ స్ట్రోక్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

హసన్‌పర్తి: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భీమారంలోని స్కిల్ స్ట్రోక్స్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 100 శాతం ఫలితాలు సాధించినట్లు పాఠశాల పాఠశాల వ్యవస్థాపక సభ్యుడు ఎర్రబెల్లి అనూప్ తెలిపారు. పాఠశాలకు చెందిన హర్షిత (473 మార్కులు), సాయి మన్విక్‌రెడ్డి గూడూరు (473 మార్కులు), కటం పరిమళ్ (471 మార్కులు) సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ ఫలితాలు సాధించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోషల్ నిచట్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాల్లో 'రోజరీ' ప్రభంజనం



ప్రణవిప్రియ



సుమన



వేదశ్రీ



దివ్య



హాసిని



వర్శిత్

హన్మకొండ చౌరస్తా : పదో తరగతి సీబీఎస్ఈ బోర్డు 2024-25 విద్యా సంవత్సర ఫలితాల్లో హనుమకొండ రెడ్డికాలనీ లోని రోజరీ హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై స్కూల్ కరస్పాండెంట్ అల్లం సునీల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యా ప్రయాణంలో పిల్లలు, పాఠశాలకు అండగా నిలిచిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. హైస్కూల్‌లో మేము విద్యా నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా బలమైన విలువలు, వ్యక్తిత్వాన్ని కూడా పెంపొందించాలని నమ్ముతామన్నారు. ఈ విజయం భవిష్యత్ బ్యాచ్‌లకు ఉన్నత లక్ష్యాలను సాధించడానికి , మరింత కష్టపడి పనిచేయడానికి ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారిలో బంటరం విష్ణువేదగౌడ్, ఉడుతనబోయిన శ్రావణి, యాసం వర్శిత్, అంకం ప్రణవి, ప్రియ, మాచర్ల దివ్య, బొమ్మతి నాగచరణ్, తాడబోయిన రిషిక, అబ్బోజు వేదశ్రీ, పల్లె హాసినీ, అల్లూరి సుమన, రాచర్ల కేతన్‌లను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగుదాం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల నాయకులు

న్యూశాయంపేట : రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలని వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, సంస్థల ప్రతినిధులు పిలుపునిచ్చాయి. మంగళవారం సాయంత్రం ములుగు రోడ్డు సెంటర్‌లోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మౌలానా ఫసియొద్దీన్ ఖాస్మీ అధ్యక్షతన వక్ఫ్ బచావో-దస్తూర్ బచావో అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనారిటీలపై దాడులు పెరిగాయని అన్నారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా అన్ని సంఘాలు ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలన్నారు. ఈనెల వరంగల్ ఇస్లామియా కళాశాలలో 18న జరిగే బహిరంగ సభ విజయవంతానికి తమ వంతు సహకారాన్ని అందించాలని పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు అన్ని పార్టీలు, ప్రజాసంఘాలను కోరాయి. సమావేశంలో వివిధ పార్టీల, ప్రజాసంఘాల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, మొగిలి, బోడ డిన్నా, జోరిక రమేశ్, డాక్టర్ రాజ్‌మహ్మద్, రాంబ్రహ్మం, నున్నా అప్పారావు, నరేందర్, వెంగల్‌రెడ్డి, హకీం నవీద్, రమాదేవి, అబ్దుల్ మజీద్, అబ్దుల్ సుభాన్, మౌలానా అతీఖుర్ రహమాన్, ఖుద్దూస్, మహ్మద్ అలీ జుబేర్, మహ్మద్ జుబేర్‌బిఎస్, మున్నాభాయి, తాజుద్దీన్, ఖలీల్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలిచ్చి ఇళ్లు మంజూరు చేయాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చక్రపాణి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హన్మకొండ అర్బన్ : నగరంలోని 4వ డివిజన్ పెద్దమ్మ గడ్డ ప్రాంతంలోని జ్యోతిబసనగర్ ఫేస్-1 ,2, రెండో డివిజన్ భగత్‌సింగ్ నగర్ కాలనీలలో 20 ఏళ్లకు పైగా నివాసముంటున్న పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరు చేసి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ హనుమకొండ నార్త్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో గత 20 ఏళ్లుగా పేదలు గుడిసెలు వేసుకొని నివాసముంటూ కరెంటు మీటర్లు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, నల్లా కనెక్షన్‌లు ఉండి ట్యాక్సీలు కూడా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నార్త్ ఏరియా కార్యదర్శి గాదె రమేష్, ఏరియా కమిటీ నాయకులు ఇంజపల్లి రాజు, మంద మల్లేశం, బొట్ల కుమారస్వామి, ఒంటెల పాపయ్య, ఆర్ రాజు, అమృత, కళావతి, యమునా, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవీందర్

హన్మకొండ : తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సాయిని రవీందర్ ఎన్నికయ్యారు. మంగళవారం హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో పుప్పాల రజనీకాంత్ అధ్యక్షతన మున్నూరు కాపుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సంఘానికి తెలంగాణ మున్నూరుకాపు సంఘం అని పేరు పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు రజనీకాంత్ తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రవీందర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కోశాధికారిగా కూరపాటి పూర్ణ సంపత్‌రావు, కార్యవర్గ సభ్యుడిగా సురేందర్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు.